క్లుప్తంగా

సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ కృషి


ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు ఆధ్వర్యాన గురువారం ఆలమూరులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య ఉన్న తేడాలను వివరించి, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మళ్లీ మద్దతు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మునుపెన్నడూ లేని విధంగా ఆలమూరులో రూ.45.34 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. వివిధ పథకాల కింద గ్రామంలో ఒక్కో ఇంటికి సుమారు రూ.లక్ష నుంచి రూ.1.6 లక్షల వరకూ ఆర్థిక సాయం అందిందన్నారు. మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల విలువ చేసే ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఆలమూరు ఎర్ర కాలనీ రాష్ట్రంలోనే ఆదర్శ కాలనీగా తయారైందని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చెప్పారు.

గడప గడపనా సంక్షేమ విప్లవం


మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, గడప గడపకూ సంక్షేమాన్ని అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యాన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులకు బ్రోచర్లు అందించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సీఎం జగన్ పాలన


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా సాగుతోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి దిండిలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలను వివరించే బ్రోచర్లను అందజేశారు. స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తూ, వారి చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు వచ్చే ఎన్నికల్లో తోడుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అల్లూరు కుటుంబ సభ్యులకు మంత్రి విశ్వరూప్ పరామర్శ


అల్లూరు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

సఖినేటిపల్లి: రాజోలు మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం పరామర్శించారు. సఖినేటిపల్లిలోని కృష్ణంరాజు నివాసానికి వెళ్లి ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, సానుభూతి తెలిపారు. మంత్రి వెంట ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు జంపన బుజ్జిరాజు, కేఎస్ఎన్ రాజు, బళ్ళ నోబుల్ ప్రభాకర్, గెడ్డం తులసీ భాస్కరరావు, చెల్లుబోయిన శ్రీనివాస్, వలవల రాంబాబు ఉన్నారు.


వానపల్లి నారాయణలంకలో స్థానికులకు వరద పరిస్థితిని వివరిస్తున్న కొత్తపేట తహసీల్దార్ కిషోర్‌బాబు


రావులపాలెం గౌతమీ పాత బ్రిడ్జి వద్ద గోదావరి ప్రవాహం


పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో పడవ దిగుతున్న విద్యార్థి


పెదపట్నం మధ్య లంక నుంచి పడవపై పశుగ్రాసాన్ని తీరానికి చేరవేసుకుంటున్న రైతులు

గోదావర్రీ

- పెరుగుతున్న వరద ఉధృతి
- లంక గ్రామాల్లో అధికారుల పర్యటనలు
- అందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి

కొత్తపేట/రావులపాలెం/ఆలమూరు/అయినవిల్లి/పి.గన్నవరం/మామిడికుదురు: గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది. తీర ప్రాంతాలతో పాటు లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ఎక్కడైనా, ఏదైనా సమస్య వస్తే తమకు తెలియజేయాలని అధికారులు సూచించారు. పలు లంక గ్రామాల్లో వారు గురువారం పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం గోదావరికి ఉధృతంగా వరద వస్తోందని, పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, ముంపు ఏర్పడితే అన్ని రకాల సహాయక చర్యలూ చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని గ్రామ స్థాయి సిబ్బందిని ఆదేశించారు.

- కొత్తపేట తహసీల్దార్ జీడీ కిశోర్‌బాబు మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బందితో కలిసి మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన వానపల్లి శివారు నారాయణలంక, సత్తెమ్మలంక తదితర గ్రామాల్లో పర్యటించారు. గోదావరి ఉధృతి పెరిగి గ్రామంలోకి వరద నీరు ప్రవేశించే పరిస్థితి ఏర్పడితే లంక గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకునేందుకు సిద్ధం కావాలని సూచించారు. ముంపు ప్రాంతాల నుంచి పశువులను ముందస్తుగా బయటకు తరలించాలని పాడి రైతులకు సూచించారు. అవసరమైతే ఆహారం, మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- రావులపాలెం మండలంలో గౌతమి, వశిష్ఠ గోదావరి నదుల్లో వరద పోటెత్తుతోంది. ప్రస్తుతానికి లంక పొలాలకు ఎటువంటి నష్టమూ లేకపోయినా, వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రైతులు లంక పొలాల్లో పంటల రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.
- ఆలమూరు మండలం బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల రైతులు గోదావరి వరదతో అప్రమత్తమయ్యారు. వ్యవసాయ సామగ్రిని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఎస్సై ఎస్.శివప్రసాద్ తదితరులు బడుగువానిలంకలో పర్యటించి, వరద పరిస్థితిని సమీక్షించారు.
- అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వద్ద తొగరపాయలోకి వరద నీరు చేరింది. ముక్తేశ్వరం – కోటిపల్లి రేవులోని తాత్కాలిక రహదారి ముంపు బారిన పడింది. వరద ఉధృతితో పంట్ల రాకపోకలు నిలిచిపోయాయి. అయినవిల్లిలంక, తొత్తరమూడిలోని పెదలంక, వీరల్లిపాలెం, శానపల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. కూరగాయల పంటలు నీట మునిగాయి. లంక ప్రాంతాల్లోని రైతులు వ్యవసాయ ఉత్పత్తులను, పాడి పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.
- పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులోని రహదారి వరద ఉధృతికి తెగిపోయింది. ఇక్కడ అధికారులు రెండు బోట్లు ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. లంకల్లోని పశువులను రైతులు ఏటిగట్లు పైకి తరలిస్తున్నారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద గోదారి పరవళ్లు తొక్కుతోంది. మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై హరికోటి శాస్త్రి వరద పరిస్థితిని పరిశీలించారు.
- మామిడికుదురు మండలం పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక తీర ప్రాంతాల ప్రజలను వరద భయం వెన్నాడుతోంది. ఈ గ్రామాల్లోని రైతులు పంట ఉత్పత్తులతో పాటు పశుగ్రాసాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పెదపట్నం గ్రామంలోని మధ్య లంక నుంచి రైతులు పశుగ్రాసాన్ని పడవలపై ఒడ్డుకు చేరవేసుకున్నారు. బి.దొడ్డవరం, అప్పనపల్లి గ్రామాల్లో సాగు చేసిన రొయ్యలను పట్టుబడి పట్టేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. పెదపట్నంలంక గ్రామంలో కూరగాయల తోటలు ముంపు బారిన పడే ప్రమాదం ఉండటంతో వాటి ఉత్పత్తులను కోసి మార్కెట్‌కు తరలించారు.


పి.గన్నవరం కొత్త, పాత అక్విడెక్టుల మధ్య వరద ఉధృతి

లంక గ్రామాల ప్రజల రక్షణకు చర్యలు

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదేశం


బూరుగులంకకు పడవపై వెళ్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: గోదావరి వరదల నేపథ్యంలో లంక గ్రామాల ప్రజల రక్షణకు అన్ని చర్యలూ చేపట్టాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అధికారులను ఆదేశించారు. బూరుగులంక రేవు వద్ద వరద ఉధృతిని గురువారం ఆయన పరిశీలించారు. లంక గ్రామాలకు పడవపై వెళ్లి ప్రజలతో మాట్లాడారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీను, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

వరద ఉధృతి నేపథ్యంలో మండలంలోని లంక గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి ఆదేశించారు. మండల స్థాయి అధికారులతో పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. లంక గ్రామాల్లోని గర్భిణులను, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను, 80 ఏళ్లు పైబడిన వృద్ధులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వరద ఉధృతి ఎక్కువైతే ఏటిగట్ల రక్షణలో భాగంగా ప్రతి అర కిలోమీటరుకు ఒక వలంటీర్ చొప్పున, మూడు షిఫ్టుల్లో నియమించి, పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ భారతి, డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మండల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

మామిడికుదురు: పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా యాళ్ల పళ్లంరాజు, ప్రధాన కార్యదర్శిగా చింతా రమేష్, ఆర్థిక కార్యదర్శిగా కేవీడీ ప్రసాద్, గౌరవాధ్యక్షునిగా చప్పిడి వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారుగా ఎల్.శ్రీమన్నారాయణ ఎన్నికయ్యారు. ఎంఈఓలు జీవీవీఎస్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబులను నూతన కార్యవర్గం ఎమ్మార్సీలో మర్యాద పూర్వకంగా కలిసింది. ఎమ్మార్సీకి రెండు రివాల్వింగ్ చైర్స్ బహూకరించింది.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

సఖినేటిపల్లి: మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక శాంతిసదన్ గాడ్స్ వర్షిప్ సెంటర్‌లో గురువారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా శిరీష జాషువా, ఉపాధ్యక్షుడిగా బళ్ళ షాలేము రాజు, జనరల్ సెక్రటరీగా పోతుల విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ఓగూరి జనార్దన్, ట్రెజరర్‌గా పాస్టర్ కొలు బాబు ఎంపికయ్యారు.

సొసైటీ భూములను పరిరక్షించాలి

సఖినేటిపల్లి: సొసైటీ భూములకు రక్షణ కల్పించాలని అంతర్వేదిపాలెంలో గురువారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘ నియోజకవర్గ స్థాయి సమావేశం డిమాండ్ చేసింది. ఆయిల్ నిక్షేపాల వెలికితీత పేరుతో బలహీన వర్గాలకు చెందిన సొసైటీ భూములను కొన్ని ప్రైవేటు కంపెనీలు బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్నించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదల అసైన్డ్ భూములను తిరిగి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నించడం శోచనీయమని పేర్కొంది. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గెడ్డం ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్, సంఘం రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన కేశవ శెట్టి, జంపన ప్రసాదరావు, దొండపాటి నరసింహారావు, దేవ సురేష్‌బాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిరసన

మామిడికుదురు: గెద్దాడలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. కుళాయిలకు విద్యుత్ మోటార్లు అమర్చడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

లేఖర్ల సంఘం నూతన కార్యవర్గం

మలికిపురం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని లేఖర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నేదునూరి సత్తిబాబు, అధ్యక్షుడిగా బొల్లాప్రగడ వంశీకృష్ణ, ఉపాధ్యక్షునిగా కస్తూరి అంజిబాబు, కార్యదర్శిగా మేడిచర్ల సుబ్బారావు, కోశాధికారిగా నేదునూరి మూర్తి, ముఖ్య సలహాదారుగా గెద్దం ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు.

వలంటీర్లకు వందనం

వైద్య సిబ్బందికి తోడుగా..

మామిడికుదురు: గత ఏడాది గోదావరి వరదల సమయంలో వలంటీర్ల సహకారంతో మహిళా ఉద్యోగులు వరద బాధితుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. పెదపట్నంలంక గ్రామంలో రెండున్నర అడుగుల వరద నీటిలో వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన ఏఎన్‌ఎంలు వరద బాధితుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. వారికి అదే గ్రామానికి చెందిన వలంటీర్లు బొక్కా సతీష్, గిడుగు బాబీ తోడుగా ఉండి బాధితుల ఇళ్లకు తీసుకు వెళ్లి తమ వంతు సహకారం అందించి ప్రశంసలందుకున్నారు.


వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు తోడుగా వెళ్లిన వలంటీర్లు సతీష్, బాబీ

వరద బాధితులకు బాసట

గత ఏడాది తీర గ్రామాలను గోదావరి వరద ముంచెత్తింది. లంక గ్రామాలకు ఇతర ప్రాంతాలతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. అటువంటి పరిస్థితుల్లో పాశర్లపూడికి చెందిన వలంటీర్ పొలమూరి రాజేష్ ప్రభుత్వం ఉచితంగా అందించిన కూరగాయలను బోటులో పెదపట్నంలంక తీసుకువెళ్లి, సహచర వలంటీర్లకు అందించి, వాటిని బాధితులకు పంపిణీ చేసే విధంగా సహకారం అందించాడు. తన పరిధి కాకపోయినా మానవతా దృక్పథంతో వేరే గ్రామానికి వెళ్లి బాధితులకు బాసటగా నిలిచాడు.


వరద బాధితులకు పంచేందుకు కూరగాయలు తీసుకు వెళ్తున్న వలంటీర్ రాజేష్

యూసీజీఎస్ సాయం

సఖినేటిపల్లి: మణిపూర్ హింసా ఘటనల్లో బాధిత కుటుంబాలకు యునైటెడ్ క్రిస్టియన్ గాస్పెల్ సొసైటీ (యూసీజీఎస్) ఆధ్వర్యాన బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. యూసీజీఎస్ జాతీయ అధ్యక్షుడు కొల్లాబత్తుల ప్రభాకరరావు ఉయ్యూరువారి మెరకలో మీడియాకు గురువారం ఈ వివరాలు తెలిపారు. 4 టన్నుల బియ్యం, కిరాణా సరకులు, ఆహార పదార్థాలను పంపిణీ చేశామని చెప్పారు.

విశ్వరూప సభను జయప్రదం చేయాలి

మామిడికుదురు: ఎస్సీ వర్గీకరణ కోసం వచ్చే నెల రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నేత నూటికుర్తి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మామిడికుదురులో బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కిసాన్ ఖేత్ అధ్యక్షునిగా దేశినీడి

మలికిపురం: కిసాన్ ఖేత్ మజ్దూర్ జిల్లా అధ్యక్షునిగా దేశినీడి ఉదయ భాస్కరరావు నియమితులయ్యారు. అమలాపురంలో డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు నుంచి ఆయన ఉత్తర్వులు అందుకున్నారు.

వీఆర్‌ఏల ఆందోళన

మామిడికుదురు/రాజోలు/అంబాజీపేట/ఆలమూరు/ఆత్రేయపురం: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండుతో గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) గురువారం వివిధ మండలాల్లో ఆందోళనలు నిర్వహించారు. పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని, డీఏతో కూడిన వేతనం అమలు చేయాలని, అర్హులకు వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మన్‌గా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మామిడికుదురు తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించారు. ఆలమూరు, రాజోలు తహసీల్దార్ కార్యాలయాల వద్ద రిలే దీక్షలు చేపట్టారు. రాజోలులో ఈ శిబిరాన్ని జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు దారపురెడ్డి వీరభద్రం ప్రారంభించారు. అంబాజీపేటలో వీఆర్‌ఏల సంఘ నేతలు మాట్లాడుతూ, గురు, శుక్రవారాల్లో కూడా విధులకు హాజరు కాకుండా నిరసన తెలుపుతామని చెప్పారు. ఆత్రేయపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు ఆందోళన నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- మాచవరం, తొత్తరమూడిల్లో జగనన్న సురక్ష

అంబాజీపేట/అయినవిల్లి/పి.గన్నవరం/ఆత్రేయపురం/సఖినేటిపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం 3, 4 సచివాలయాల వద్ద తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన గురువారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల వద్దకే పాలన అనే మాటను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని అన్నారు. పథకాలు అందుకోని వారికి వాటిని వర్తింపజేసేందుకే జగనన్న సురక్ష అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- అయినవిల్లి మండలం తొత్తరమూడి–2 గ్రామ సచివాలయం పరిధిలో సర్పంచ్ వార జయసావిత్రి అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టిబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే వీరవల్లిపాలెం సచివాలయ పరిధిలో సర్పంచ్ సలాది బుచ్చిరాజు అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
- పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు తోలేటి బంగారు నాయుడు, తోరం వీవీ సత్యనారాయణల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. రెండు గ్రామాల్లో మొత్తం 1,270 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 87 మందికి ఆధార్ సేవలు అందించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, ఈఓ అండ్ పీఆర్డీ శరభరాజు, పంచాయతీ కార్యదర్శి గిడుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్రేయపురం మండలం నార్కెడ్‌మిల్లి, కట్టుంగ గ్రామాల్లో సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు, కరుటూరి బ్రహ్మజీ అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. మొత్తం 3,859 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. నార్కెడ్‌మిల్లి గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కప్పల శ్రీధర్, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబా, ఎంపీటీసీ సభ్యుడు పాల వెంకట రమణ, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. కట్టుంగలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంపీటీసీ సభ్యురాలు కేత వరలక్ష్మి పాల్గొన్నారు.
- సఖినేటిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపును సర్పంచ్ గొల్లమండల చిట్టిబాబు ప్రారంభించారు. ఎంపీడీఓ జి.భీమారావు, తహసీల్దార్ వై.రామకుమారి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, ఎంపీటీసీ సభ్యుడు నల్లి రత్నకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, పీఏసీఎస్ అధ్యక్షుడు రుద్రరాజు రంగరాజు, నాయకులు పాల్గొన్నారు.


తొత్తరమూడిలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

జగనన్న సురక్షతో అద్భుత ఫలితాలు


పడమటిపాలెంలో మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా అద్భుత ఫలితాలు వస్తున్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం కత్తిమండ, పడమటిపాలేల్లో జరిగిన జగనన్న సురక్ష గ్రామసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాపాక లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు అందించారు. ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆకుల మాధవీ నాగలక్ష్మి, ఆరేటి రంగనాయకులు, ఎంపీటీసీ చిట్టాల శ్రీనివాస్, తహసీల్దార్ వీవీ నరసింహరావు, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

ఆలమూరు: ఆలమూరు–2, పినపళ్ల గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాస్, నామాల శ్రీనివాస్ గురువారం తెలిపారు. తహసీల్దార్ ఐపీ శెట్టి నేతృత్వంలో ఆలమూరు–2లోను, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో పినపళ్ల కల్యాణ మండపం వద్ద ఈ శిబిరాలు ఏర్పాటు చేయనున్నారని వివరించారు.